
మహిళా దినోత్సవం
సాక్షి
కామారెడ్డి
రేపటికి ముందడుగు
శుక్రవారం । 8 । మార్చి । 2024





న్యూస్‌రీల్

'ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలి'



కామారెడ్డి టౌన్‌: లే అవుట్‌ రెగ్యులరైజేషన్‌ స్కీం(ఎల్‌ఆర్‌ఎస్‌)ను ఎలాంటి ఫీజులు వసూలు చేయకుండా అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌ డిమాండ్‌ చేశారు. ఈ విషయమై గురువారం కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఫీజులు తీసుకోకుండా దరఖాస్తులను స్వీకరించి ప్లాట్లను క్రమబద్ధీకరిస్తామని గతంలో కాంగ్రెస్‌ హామీ ఇచ్చిందన్నారు. ఇప్పుడు ఆ హామీని విస్మరించి ప్రజలపై భారం మోపడం సరికాదన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్‌, నాయకులు జూకంటి ప్రభాకర్‌, గైని శ్రీనివాస్‌గౌడ్‌, లక్ష్మీనారాయణ, నల్లవెల్లి అశోక్‌ తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రికి ప్రత్యేక బస్సు సర్వీసులు



కామారెడ్డి టౌన్‌: మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని కామారెడ్డి డిపో నుంచి పుణ్య క్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నారు. కామారెడ్డి డిపో నుంచి ఈనెల 7, 8, 9 తేదీల్లో వేములవాడకు 30 ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్‌ ఇందిర తెలిపారు. అలాగే మద్దికుంట, సంతాయిపేట, భిక్కనూరు ఆలయాలకూ ప్రత్యేక బస్సు సర్వీసులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. భక్తులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాన్సువాడ ఆర్టీసీ డీఎంకు అవార్డు



బాన్సువాడ: బాన్సువాడ ఆర్టీసీ బస్‌ డిపో మేనేజర్‌ సరితాదేవికి గ్రాండ్‌ ఫెస్టివల్‌ చాలెంజ్‌ అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళా భవన్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌, ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకున్నారు. దసరా, దీపావళి, క్రిస్మస్‌, సంక్రాంతి పండుగల సమయంలో ప్రయాణికులకు సరిపడా బస్సులను నడిపించే విధంగా చర్యలు తీసుకున్నందుకు ఈ అవార్డు అందించారు.

వివక్ష రూపుమాపాలి



సాక్షి టాక్‌షోలో పాల్గొన్న విద్యార్థినులు

- ఆడ, మగ భేదం వద్దు
- మహిళల్లో అపారమైన శక్తి ఉంది
- అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' టాక్‌ షోలో విద్యార్థులు

ఆడవారిలో అపారమైన శక్తి ఉందని, సమానత్వమే తమకు ప్రోత్సాహమని యువతులు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మానిక్‌బండార్‌లోని కిట్స్‌ ఇంజినీరింగ్‌ మహిళా కళాశాలలో 'సాక్షి' దినపత్రిక గురువారం టాక్‌ షో నిర్వహించింది. 'ఆడపిల్లలపై వివక్ష ఎక్కడ ఉంది..?' అంశంపై ఇంజినీరింగ్‌ విద్యార్థినులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఆడ, మగ వివక్షను రూపుమాపాలని గొంతెత్తారు.

– నిజామాబాద్‌అర్బన్‌

సోషల్‌ మీడియాను నియంత్రించాలి



సోషల్‌ మీడియాను నియంత్రించాలి. ఇందులోనూ ఆడవారిపై వివక్షచూపే అంశాలు ఎక్కువగా ఉంటున్నాయి. లైక్‌ల కోసం ఇష్టానుసారంగా వీడియోలు చేసి పోస్ట్‌ చేస్తున్నారు. సోషల్‌ మీడియాను నియంత్రించేందుకు ప్రభుత్వాలు కఠిన చర్యలు రూపొందించాలి. అప్పుడే ఇబ్బందులు ఉండవు. – సాత్విక

శిక్ష పడడం లేదు



మహిళలపై దాడులు చేసిన వారిపై, లైంగిక వేధింపులకు పాల్పడే వారిపై చట్టపరంగా సరైన చర్యలు ఉండడం లేదు. నిందితులు మధ్యలోనే తప్పించుకుంటున్నారు. శిక్ష అమలవుతేనే మార్పునకు అవకాశం ఉంటుంది. చట్టంలో నిబంధనలు ఉండాలి. కఠినంగా వ్యవహరిస్తేనే ఫలితం ఉంటుంది.

– ఎస్‌.కావేరి, ఈసీఈ థర్డ్‌ ఇయర్‌

'ఉచిత బస్సు' తేడా చూపుతుంది



ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత బస్సు ప్రయాణం సరైంది కాదు. ఈ నిర్ణయం ఆడ, మగ అనే తేడాను చూపుతోంది. ఉచిత బస్సు ప్రయాణం వల్ల కూడా చిన్నపిల్లలు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివక్షను ఎత్తిచూపే సదుపాయాలు ఉండకూడదు. అందరూ సమానమే అనే విధంగా అభివృద్ధి పథకాలు ఉండాలి. – సంజన శ్రీ

మార్ఫింగ్‌ ఆందోళన కలిగిస్తోంది




ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానాన్ని మిస్‌యూజ్‌ చేస్తుండడంతో ఆడవారే ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా సోషల్‌ మీడియా లో మహిళలు, విద్యార్థినుల మార్ఫింగ్‌ ఫొటోలు, వీడియోలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఎక్కడకు వెళ్లినా ఆడవారిపైన వివక్ష కొనసాగుతోంది. – సీహెచ్‌ శ్రీవర్షిణి

మహిళలకు తప్పని వేధింపులు

- ఫిర్యాదుకు అతివల వెనకడుగు
- సాక్షి సర్వేలో వెల్లడి

సమాజం మారుతున్నా.. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్నా.. మహిళలపై వివక్ష, వేధింపులు ఆగడం లేదు. విద్యార్థినులు, మహిళలు నిత్యం ఏదో ఒకరకంగా వివక్ష ఎదుర్కొంటునే ఉన్నారు.. ఆడపిల్ల బయటకు వెళ్లాలంటే ఇంకా పూర్తిస్థాయిలో స్వేచ్ఛ లభించడం లేదు. మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో నాలుగు ప్రశ్నలతో వివిధ రంగాల్లోని 530 మంది మహిళలు, విద్యార్థులను సర్వేచేయగా వారు ఇంకా వేధింపులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. కొద్దిమేర మార్పు వస్తున్నా కొన్ని రంగాల్లో మాత్రం ఇంకా వివక్ష కొనసాగుతునే ఉందని పేర్కొన్నారు. మరోవైపు ఇబ్బందులు పడుతున్నా.. ఫిర్యాదు చేసేందుకు అతివలు వెనకడుగు వేస్తున్నట్లు తేలింది. బస్టాండ్‌, రైల్వే స్టేషన్‌, మార్కెట్‌ తదితర ప్రాంతాల్లో ఇబ్బందులు పడుతున్నట్లు మహిళలు తెలిపారు. –నిజామాబాద్‌ అర్బన్‌

సర్వేలో మహిళలు తెలిపిన అభిప్రాయాలు





ఐఏఎస్‌ అధికారిణి కిరణ్మయి

గెస్ట్‌ ఎడిటర్‌గా..

- ఎప్పటికీ మరచిపోలేని తీపి గుర్తుగా పేర్కొన్న ఐఏఎస్‌ అధికారిణి కిరణ్మయి
- ఈ అవకాశంతో ఆలోచనలకు మరింత పదును పెరుగుతుందని వ్యాఖ్య
- పాత్రికేయులు ఎదుర్కొనే సవాళ్లు ఆసక్తికరమంటూ అభినందన

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: 'సాక్షి' నిజామాబాద్‌ ఎడిషన్‌ కార్యాలయంలో గురువారం గెస్ట్‌ ఎడిటర్‌గా ఐఏఎస్‌ అధికారిణి డాక్టర్‌ కొప్పిశెట్టి కిరణ్మయి వ్యవహరించారు. డెస్క్‌కు వచ్చిన వార్తలను పరిశీలించి పేజీలకు కేటాయించారు. సబ్‌ ఎడిటర్లకు పలు సూచనలు ఇచ్చారు.

ఆమె ఈ సందర్భంగా మాట్లాడుతూ రెప్యుటేషన్‌ కలిగిన పత్రికకు గెస్ట్‌ ఎడిటర్‌గా వ్యవహరించే అవకాశం రావడం ఎప్పటికీ మరిచిపోలేని తీపి గుర్తుగా పేర్కొన్నారు.

నిరంతరం ప్రపంచాన్ని మేలుకొల్పే పత్రికా రంగం ద్వారా అందుతున్న సేవలు చాలా గొప్పవన్నారు. అత్యంత బాధ్యతాయుతమైన సేవలు అందించే చోట తనకు గెస్ట్‌ ఎడిటర్‌గా పనిచేసే అవకాశం వచ్చిందన్నారు. వార్తా సేకరణ మొదలు పబ్లిష్‌ అయ్యాక ప్రజలకు కలిగే ఉపయోగాలు, ఈ క్రమంలో పాత్రికేయులు ఎదుర్కొనే సవాళ్లు, తదుపరి పరిణామాలను చూస్తుంటే ఆసక్తిగా ఉందన్నారు. గెస్ట్‌ ఎడిటర్‌గా వ్యవహరించడం కారణంగా సరికొత్తగా వచ్చే ఆలోచనలకు మరింత పదును పెట్టుకోవచ్చని అర్థమవుతోందన్నారు. సివిల్స్‌ ప్రిపరేషన్‌ కోసం పత్రికలు చదివానని, ఇకపై ప్రజా సమస్యల పరిష్కారం కోసం సైతం పత్రికల కథనాలను క్షుణ్ణంగా గమనిస్తానన్నారు. మెడికల్‌ పీజీ చేసే సమయంలో పేషంట్ల ద్వారా వివిధ రకాల అంశాలు తెలుసుకున్నానన్నారు. ప్రస్తుతం గెస్ట్‌ ఎడిటర్‌గా రావడం కారణంగా వివిధ అంశాలు తెలిశాయన్నారు. సివిల్‌ సర్వెంట్‌గా విద్య, వైద్య సేవలందించే విషయంలో, మహిళా సాధికారత విషయంలో శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. దివ్యాంగుల కోసం డేకేర్‌ సెంటర్లు ఏర్పాటు చేసే దిశగా కృషి చేస్తానన్నారు.

భర్త ప్రోత్సాహం.. తల్లిదండ్రుల సహకారంతో..

ఎంఎస్‌ జనరల్‌ సర్జన్‌గా పట్టభద్రురాలైన తర్వాత ఒక పాపకు జన్మనిచ్చాక సివిల్స్‌ ప్రిపరేషన్‌ ప్రారంభించి ఐఏఎస్‌కు ఎంపికయ్యారు కిరణ్మయి. సొంత రాష్ట్రమైన తెలంగాణ కేడర్‌కు ఎంపికైన ఆమె తన భర్త విజయ్‌కుమార్‌ ప్రోత్సాహంతో నాలుగో ప్రయత్నంలో అనుకున్నది సాధించారు. కిరణ్మయి తండ్రి లక్ష్మణ్‌రావు, తల్లి వెంకటలక్ష్మి ప్రభుత్వ ఉద్యోగులుగా రిటైరయ్యారు. తల్లిదండ్రులు, సోదరుడి ప్రోత్సాహంతో ఉస్మానియా మెడికల్‌ కళాశాల నుంచి 2010లో ఎంబీబీఎస్‌, 2015లో ఎంఎస్‌ జనరల్‌ సర్జన్‌ పూర్తి చేశారు. 2014లో వివాహం చేసుకున్నారు. భర్త విజయ్‌కుమార్‌ గ్రూప్‌–1 అధికారిగా జీఎస్టీ విభాగంలో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. ఐఏఎస్‌ కావాలనుకుని విఫలవడంతో కిరణ్మయిని ప్రోత్సహించారు. దీంతో ఆమె 2016లో సివిల్స్‌ ప్రిపరేషన్‌ ప్రారంభించారు. తల్లిదండ్రులు, భర్త పాపను చూసుకున్నారు. మొదటి ప్రయత్నంలో ఇండియన్‌ రైల్వే ట్రాఫిక్‌ సర్వీస్‌కు, రెండో ప్రయత్నంలో డానిక్స్‌(ఢిల్లీ, అండమాన్‌ నికోబార్‌ ఐలాండ్స్‌ సెంట్రల్‌ సర్వీస్‌కు) ఎంపికయ్యారు. డానిక్స్‌ పరిధిలో సర్వీస్‌లో చేరిన కిరణ్మయి మూడో ప్రయత్నంలో ప్రిలిమ్స్‌లోనే విఫలమయ్యారు. అయినప్పటికీ పట్టువదలకుండా ఢిల్లీలో ఉద్యోగం చేస్తూనే నాలుగో ప్రయత్నంలో 2022లో 56వ ర్యాంక్‌తో ఐఏఎస్‌గా ఎంపికై సొంత రాష్ట్ర కేడర్‌ దక్కించుకున్నారు.



చదువే గేమ్‌ చేంజర్‌..

చదువు అనేది ప్రతి ఒక్కరికీ గేమ్‌ చేంజర్‌ లాంటిది. చదువు విషయంలో ఆడపిల్లలను మగపిల్లలతో సమానంగా చూడాలి. ఆడపిల్లలను చదువు విషయంలో ఎంత ప్రోత్సహిస్తే అంత ఎక్కువ స్థాయిలో ఫలితాలు వస్తాయి. అన్ని రంగాల్లో మహిళలు తిరుగులేని విజయాలు సాధిస్తున్నారు. ఆడపిల్లలకు ఏమాత్రం చిన్న ప్రోత్సాహమిచ్చినా ఆకాశమే హద్దుగా దూసుకెళ్తారన్నారు. సాంకేతిక, వైద్య, విద్య రంగాలతో పాటు ఇస్రో, నాసాల్లో సైతం మహిళా శాస్త్రవేత్తలే అధికంగా ఉన్నారు. న్యాయవాదులుగా, ఎగ్జిక్యూటివ్స్‌గా, బ్యూరోక్రాట్స్‌గానే కాకుండా ప్రపంచవ్యాప్తంగా రాజకీయ రంగంలోనూ మహిళలు అందిస్తున్న సేవలు ఆదర్శనీయంగా ఉంటున్నాయి. ఆడప్లిలలను ఏమాత్రం భారంగా భావించకూడదు. – కిరణ్మయి

పాలనలో మార్పు రావాల్సిందే

- అవినీతికి పాల్పడితే సహించేది లేదు
- బల్దియా సమావేశంలో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి
- రూ. 40 కోట్ల అప్పు చేయడంపై అసహనం
- రెండోసారీ ఎజెండా అంశాలపై చర్చ వాయిదా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్‌: కామారెడ్డి బల్దియా పరిపాలనలో మార్పు రావాల్సిందేనని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. గురువారం కామారెడ్డి మున్సిపల్‌ కార్యాలయంలోని కౌన్సిల్‌ హాల్‌లో చైర్‌పర్సన్‌ నిట్టు జాహ్నవి అధ్యక్షతన జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాలుగు గంటల పాటు జరిగిన సమావేశంలో పట్టణ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశం అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. బల్దియాకు సుమారు రూ. 40 కోట్ల ఆదాయం సమకూరేందుకు అవకాశాలున్నా పట్టించుకోకుండా అసమర్థ పాలనతో రూ. 40 కోట్ల అప్పులయ్యాయన్నారు. రూ. 17.50 కోట్ల విద్యుత్‌ బిల్లులు బకాయి ఉన్నాయని, కార్మికుల ఖాతాల్లో పీఎఫ్‌ జమ చేయడం లేదని, వర్క్‌ బిల్లులు, ఎస్‌డీఎఫ్‌ బిల్లులు బకాయి ఉన్నాయని పేర్కొన్నారు. ఏటా కేవలం రూ. 11 కోట్ల ఆదాయంతో రూ. 15 కోట్లకుపైగా ఖర్చుతో పాలన సాగిస్తూ, దారుణంగా అప్పులు చేసుకుంటూపోతే రాబోయే రోజుల్లో పట్టణంలో అభివృద్ధి పనులు ఎలా చేపడతారని ప్రశ్నించారు. కార్మికులకు వేతనాలు ఇవ్వలేని స్థితిలో బల్దియా ఉందని, ఇలాంటి మున్సిపాలిటీని ఎక్కడా చూడలేదని పేర్కొన్నారు. బల్దియాలో అవినీతికి పాల్పడితే సహించనన్నారు. పట్టణంలోని దుకాణాలనుంచి తక్కువ పన్నులు వసూలు చేస్తున్నారన్నారు. డబ్బాలో డబ్బు లేకున్నా గొప్పగా డప్పు కొట్టుకోవడం ఆపాలన్నారు. ఇక ఆదాయ మార్గాలపై దృష్టి సారించాలని పాలకవర్గానికి సూచించారు. పట్టణంలో 500 ఓపెన్‌ స్థలాలు ఉండగా.. అందులో 300 స్థలాలను కుల సంఘాలకు కేటాయిస్తే పార్కులు లేకుండా పట్టణం ఎలా అభివృద్ధి చెందుతుందో చెప్పాలన్నారు. భవిష్యత్తు తరాల కోసం పట్టణ అభివృద్ధికి పుర ప్రజలు సహకరించాలని కోరారు. పట్టణ రోడ్లను పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్‌ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లపై చెత్త వేస్తే జరిమానాలు విధించాలని అధికారులకు సూచించారు. మున్సిపల్‌ అధికారులు అంకితభావంతో పని చేయాలని కలెక్టర్‌ జితేష్‌ వి పాటిల్‌ సూచించారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణ ప్రకృతి వనాలలో మొక్కలు ఎండిపోకుండా చూడాలన్నారు.

ఎజెండా అంశాలపై విచారణకు ఆదేశం

గతనెల 23వ తేదీన జరిగిన సమావేశంలో ఎజెండా అంశాలపై అక్రమాలపై సభ్యులు ప్రశ్నించిన విషయం తెలిసిందే. కాంగ్రెస్‌, బీజేపీ సభ్యుల వినతి మేరకు సమావేశాన్ని వాయిదా వేశారు. గురువారం జరిగిన సమావేశంలోసైతం అవే 26 ఎజెండా అంశాలను పొందుపరచడంతో మళ్లీ సభ్యులు ఆందోళన చేశారు. తమతో చర్చించకుండా మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ జాహ్నవి, బీఆర్‌ఎస్‌ కౌన్సిలర్లు ఎజెండా తయారు చేశారని, అందులో అక్రమ పనులు ఉన్నందున సమావేశాన్ని వాయిదా వేసి విచారణ జరిపించాలని డిమాండ్‌చేశారు. ఈ మేరకు కాంగ్రెస్‌ కౌన్సిలర్లు కలెక్టర్‌, ఎమ్మెల్యే, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌లకు వినతిపత్రం అందించారు. దీంతో ఎజెండా అంశాలపై చర్చ వాయిదా వేస్తున్నట్లు చైర్‌పర్సన్‌ జాహ్నవి ప్రకటించారు. ఆ ఎజెండా అంశాలపై నలుగురు ఇంజినీరింగ్‌ అధికారులతో విచారణ జరిపించాలని ఎమ్మెల్యే కేవీఆర్‌ కలెక్టర్‌ను ఆదేశించారు. కాగా వేసవి నీటి ఎద్దడి అదనపు ఎజెండా అంశాన్ని ఆమోదించారు. సమావేశంలో వైస్‌ చైర్‌పర్సన్‌ ఇందుప్రియ, కమిషనర్‌ సుజాత, అధికారులు, కౌన్సిల్‌ సభ్యులు పాల్గొన్నారు.

నిజాంసాగర్‌ నీటి విడుదల

నిజాంసాగర్‌: నిజాంసాగర్‌ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు గురువారం ఉదయం ఆరో విడత నీటి విడుదలను ప్రారంభించారు. ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు 2 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నామని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రధాన కాలువలో ప్రవహిస్తున్న నీటిని డిస్ట్రిబ్యూటరీ తూముల ద్వారా పంటపొలాలను పారించుకోవాలని సూచించారు. ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్నందున కాలువ వైపు రైతులు వెళ్లవద్దని అధికారులు సూచించారు.



ప్రధాన కాలువలో ప్రవహిస్తున్న సాగర్‌ జలాలు

అమ్మా, నాన్న.. ఓ కూతురు

- ఆడపిల్లైనా.. ఒక్కరే చాలనుకున్నారు
- అన్నీ సమకూర్చి ఉన్నతంగా తీర్చిదిద్దారు
- ఆదర్శంగా నిలుస్తున్న తల్లిదండ్రులు

వారసుడు అంటే కుమారుడే అన్న భావన సమాజంలో ఉంది. మగబిడ్డ కోసం రెండు, మూడు, నాలుగు కాన్పులు కూడా ఎదురు చూసే వారుంటారు. కడుపులో పెరుగుతున్నది ఆడబిడ్డని తెలిస్తే.. గర్భంలోనే ఊపిరి ఆపేయడానికీ వెనుకాడనివారూ ఉన్నారు. కానీ కొందరు మాత్రం ఇందుకు భిన్నంగా ఉంటారు. తొలి కాన్పులో ఆడబిడ్డ జన్మించినా.. ఆమే చాలనుకున్నారు. కూతురు బంగారు భవిష్యత్‌కు బాటలు వేశారు. ఆ కూతుళ్లూ కన్నవారి కలల్ని నిజం చేస్తూ ఉన్నతంగా ఎదిగారు. శుక్రవారం మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.. – సాక్షి, కామారెడ్డి

వివక్ష ఉండకూడదు..



అన్నపూర్ణతో తల్లిదండ్రులు భూదేవి, శ్రీనివాస్‌, ఎల్లారెడ్డి

మాకు పాప పుట్టగానే ఎంతో మురిసిపోయాం. ఒక్కరే చాలనుకున్నాం. ఉన్నతంగా చదివించాలని అనుకున్నాం. మేము కలలు కన్నట్టే మా కూతురు అన్నపూర్ణ ఉన్నతంగా చదివింది. ఎంఫార్మసీ పూర్తి చేసింది. ఆమెకు వివాహం చేశాం. భర్తతో కలిసి ముంబయిలో ఉంటోంది. అక్కడే ఉద్యోగం చేస్తోంది. ఆడ పిల్లల విషయంలో వివక్ష ఉండకూడదు. వాళ్లను మంచిగా చదివించాలి.

మంచి చదువు ఇవ్వాలనుకున్నాం



శ్రీనిపతో తల్లిదండ్రులు వి.పద్మ, శ్రీనివాస్‌, కామారెడ్డి

మాకు ఒక కూతురు జన్మించింది. మా ఇద్దరి పేర్లు కలిసేలా శ్రీనిప అని పేరు పెట్టుకున్నాం. ఒక్క పాప అయితే మంచిగా చదవించవచ్చని అప్పుడే నిర్ణయం తీసుకున్నాం. మా పాప బ్యాచ్‌లర్‌ ఆఫ్‌ ఫిజియోథెరపీ చదివింది. ప్రస్తుతం ప్రాక్టీస్‌ చేస్తోంది. ఉన్నత చదువులు కూడా చదివే ప్రయత్నం చేస్తోంది. వారసులు ఆడపిల్లనా, మగపిల్లనా అనే వ్యత్యాసం పోవాలి. ఆడపిల్లలను ప్రోత్సహిస్తే వాళ్లు ఉన్నతంగా ఎదుగుతారు.

ఒక్కరే చాలనుకున్నాం..



సౌమ్యశ్రీతో తల్లిదండ్రులు సరిత, పాపారావు, కామారెడ్డి

మా కూతురు పేరు సౌమ్యశ్రీ. ఇంజినీరింగ్‌ పూర్తి చేసింది. ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లే ప్రయత్నంలో ఉంది. సంతానం ఒక్కరే అయితే ఉన్నతంగా చదివించడానికి అవకాశం ఎక్కువగా ఉంటుందని అనుకున్నాం. అందుకే ఒక్కరే చాలనుకున్నాం. ఆమె చదువు పూర్తై ఉద్యోగంలో చేరిన తర్వాతే పెళ్లి చేయాలని అనుకుంటున్నాం. నేటి రోజుల్లో ఆడ, మగ అనే తేడా ఉండకూడదు.

ఎవరైనా ఒక్కటే..



జాహ్నవితో తల్లిదండ్రులు నిట్టు కరుణశ్రీ, వేణుగోపాల్‌రావు, కామారెడ్డి

మాకు కూతురు జాహ్నవి పుట్టిన తర్వాత ఒక్కరే సంతానం చాలన్న నిర్ణయానికి వచ్చాం. ఆమెకు మంచి భవిష్యత్‌ను కానుకగా ఇవ్వాలనుకున్నాం. ఉన్నత చదువులు చదివించాం. అనుకోకుండా రాజకీయాల్లోకి అడుగుపెట్టింది. నాలుగున్నరేళ్లుగా కామారెడ్డి మున్సిపల్‌ చైర్‌పర్సన్‌గా పాలన సాగిస్తోంది. తల్లిదండ్రులు సంతానం ఆడ అయినా, మగ అయినా అందరినీ సమానంగా చూడాలి.

క్లుప్తంగా

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



కామారెడ్డి టౌన్ : నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం) స్కీం ఉద్యోగులను ఎలాంటి షరతులు లేకుండా క్రమబద్ధీకరణ చేయాలని ఆర్‌బీఎస్‌కే ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మణ్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని కోరారు. తక్షణమే తమకు పేస్కేల్ అమలు చేయాలని, సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. 7 నెలల ఏరియర్స్ బకాయిలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ మారుతి బాబు, హరి, మనోజ్, మమత, సిబ్బంది తదితరులున్నారు.

విద్యార్థులు చురుకుగా ఆలోచించాలి

కామారెడ్డి అర్బన్ : ఉద్యోగాల సాధనకు అర్థమెటిక్, రీజనింగ్ అంశాలు ఎంతగానో దోహదం చేస్తాయని, విద్యార్థులు చురుకుగా ఆలోచించినప్పుడే ఉద్యోగాలు సులువుగా సాధించగలుగుతారని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కే కిష్టయ్య అన్నారు. కళాశాలలో సోమవారం నుంచి నిర్వహించిన అర్థమెటిక్, రీజనింగ్ శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ముగింపు సమావేశంలో వైస్‌ప్రిన్సిపాల్ మాట్లాడారు. అనంతరం శిక్షణలో ప్రతిభ కనబర్చిన పదిమంది విద్యార్థులకు జ్ఞాపికలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్తలు వి శంకరయ్య, ఫర్హీన్ ఫాతిమా, మెంటర్ అజారొద్దీన్, అధ్యాపకులు ఆరె శ్రీలత, సుచరణ్, ఆఫ్రీన్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

లైన్‌మన్లకు సన్మానం



కామారెడ్డి అర్బన్ : జాతీయ విద్యుత్ లైన్‌మన్ దినోత్సవం సందర్భంగా గురువారం కామారెడ్డి కలెక్టరేట్ సమీపంలో సబ్‌స్టేషన్‌లో సబ్‌ఇంజినీర్లు, లైన్‌మన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ కామారెడ్డి గ్రామీణ ఏఈ శ్రీనివాస్, సబ్‌ఇంజినీర్ నవీన్, లైన్‌మన్లు, పోచయ్య, నగేష్, రాములు, రవీందర్, మాన్‌సింగ్, అనిల్‌కుమార్, రవీందర్, గణేష్, భరత్, ప్రశాంత్‌రెడ్డి, రాజశేఖర్, వెంకటేశం, ప్రవీణ్, దయాకర్, నరేష్, సాగర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

బాన్సువాడ : పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని బాన్సువాడ ఆర్డీవో భుజంగరావు అన్నారు. గురువారం ఆర్డీవో ఆఫీస్‌లో కార్యాలయంలో ఆయన మైనారిటీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వరప్రసాద్, సీఐ కృష్ణ తదితరులు ఉన్నారు.

విరాళం

మాచారెడ్డి: చుక్కాపూర్ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ అభివృద్ధి కోసం పాల్వంచ మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్ రెడ్డి, రాణి దంపతులు గురువారం రూ.32,600 విరాళం ఇచ్చారు. వారి కుమారుడికి పోలీసు శాఖలో ఉద్యోగం వచ్చినందుకు స్వామివారికి మొక్కుబడిగా తమ వంతు సహాయంగా విరాళంగా అందజేశారు. దాతకు స్వామివారి చిత్రపటాన్ని అందజేసి సన్మానించారు.

హ్యాట్సాఫ్.. హన్సీ

- ఆరేళ్ల క్రితం అనారోగ్యంతో భర్త మృతి
- వ్యవసాయ పనులు చేస్తూ పిల్లల పోషణ




నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఆరేళ్ల క్రితం అనారోగ్యంతో భర్త దూరమవడంతో ఆమెకు కుటుంబ భారం మోయకతప్పలేదు. ఒకవైపు పొలం పనులు చేసుకుంటూ మరోవైపు పిల్లలను చదివిస్తోంది. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం ఎర్రకుంట తండాకు చెందిన అంగోత్ హన్సీ, అంగోత్ దాసు దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కాగా దాసు ఆరేళ్ల క్రితం క్యాన్సర్‌తో మరణించాడు. దీంతో పిల్లల భారమంతా హన్సీపైనే పడింది. ప్రస్తుతం హన్సీ పెద్ద కూతురు అనిత హైద్రాబాద్‌లో నర్సింగ్ కోర్సు, మూడో కూతురు గంగోత్రి 9వ తరగతి, కుమారుడు రాకేష్ 6వ తరగతి చదువుతున్నారు. రెండో కూతురు బూలి అనారోగ్య సమస్యలతో ఇంటి వద్దనే ఉంటోంది. హన్సీ తనకున్న ఏడెకరాల పొలాన్ని తానే స్వయంగా సాగు చేసుకుంటుంది. పంటల సాగుకు అవసరమైన విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల సంచులను తన వద్దనున్న స్కూటీపై గోపాల్‌పేట, ఎల్లారెడ్డి నుంచి తెచ్చుకుంటుంది. పొలం పనులను చేసుకుంటూ పిల్లల పోషణ చూసుకుంటున్న హన్సీకి మండల ప్రజలు హ్యాట్సాఫ్ చెబుతున్నారు.

వనితర సాధ్యులు!

రేపటికి ముందడుగు

ఓర్పు, నేర్పుకు ఆమె చిరునామా.. అమ్మగా లాలించినా, ఆలిగా ప్రేమించినా, అక్కగా ఆదరించినా, అనురాగానికి నిలువెత్తు నిదర్శనం.. ఆలనలో, పాలనలో ఎక్కడైనా ఆమె స్థానం ప్రత్యేకం. పేద, మధ్య తరగతి, ఉన్నత వర్గాలన్న తారతమ్యం లేకుండా ప్రతి స్త్రీ తాను ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరాలంటే ఎన్నో ప్రతిబంధకాలు అడ్డుగోడలుగా నిలుస్తున్నాయి. ఆర్థిక ఇబ్బందులు, వివక్షతతో కూడిన సామాజిక కట్టుబాట్లు శాపంగా మారుతున్నాయి. వీటన్నింటినీ దాటుకుని ఎందరో మహిళలు వృత్తి, ఉద్యోగం, వ్యాపారం, సేవ, కళలు తదితర రంగాల్లో విశేష ప్రతిభ కనబరుస్తున్నారు. తమకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంటున్నారు. ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనాలు.. – సాక్షి, కామారెడ్డి

- అన్నింటా విజయ ప్రస్థానం
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



'డ్వాక్రా'తో ఆర్థికంగా నిలదొక్కుకొని..

దోమకొండ: పురుషులతో పాటు మహిళలు కూడా ఏదైనా సాధించగలరని దోమకొండకు చెందిన నాగుల నవత నిరూపించారు. బీడీ కార్మికురాలిగా పని చేసి ఆ తర్వాత వ్యాపారం ప్రారంభించి మంచి స్థాయికి తమ కుటుంబం వెళ్లేలా కష్టపడి ఆమె విజయం సాధించారు. డ్వాక్రా సంఘం ద్వారా తీసుకున్న రుణంతో వ్యాపారం చేసి ఆర్థికంగా ఎదిగినట్లు తెలిపారు. గతంలో నవత బీడీ కార్మికురాలిగా పని చేయగా.. ఆమె భర్త సురేష్ ఆటో నడుపుతూ జీవనం సాగించేవారు. 2013లో డ్వాక్రా సంఘంలో చేరి రూ.లక్ష అప్పు తీసుకుని పిండి గిర్ని ప్రారంభించారు. అప్పును 20 నెలల్లో తీర్చగా.. బ్యాంకు వారు మరో రూ.లక్ష అప్పుగా ఇచ్చారు. 2015లో పిండి గిర్నీతో పాటు పసుపు, కారంపొడి గిర్నీలను కూడా ప్రారంభించారు. దీంతో వ్యాపారం బాగా నడిచి మంచి లాభాలు వచ్చాయి. వీటికి తోడు దీని పక్కనే కిరాణాషాపు కూడా పెట్టుకున్నారు. ప్రస్తుతం ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు మంచి స్కూళ్లలో చదువుతున్నారు. కానీ ఇటీవల ప్రమాదంలో ఆమె భర్త కాలి విరిగింది. అయినా మొక్కవోని ధైర్యంతో ఇంటిని నడుపుతూ పిల్లలను చదివిస్తున్నట్లు నవత తెలిపారు. డ్వాక్రా సంఘం వల్లే తాను జీవితంలో విజయం సాధించినట్లు ఆమె సాక్షితో వివరించారు.





ఆమె దుఃఖాన్ని దిగమింగింది

మాచారెడ్డి: చిన్నతనంలో భర్తను కోల్పోయి దుఃఖాన్ని దిగమింగుతూ జీవితాన్ని గెలిచింది చుక్కాపూర్ గ్రామానికి చెందిన పాపగారి రాజమణి. భర్త చిన్న బాలయ్య చనిపోయేనాటికి కుమారుడు బాల్‌రాజుకు మూడేళ్లు, కూతురు బాలలక్ష్మికి ఏడాది వయస్సు. ఒక వైపు వ్యవసాయం, కూలీనాలీ చేస్తూ మరోవైపు పిల్లల్ని పోషిస్తూ ఎన్నో అవమానాలకు గురైంది. ఒక్కోసారి బతకడం కంటే చావడం మేలని అనిపించినా పిల్లల కోసమైనా బతకాలనే దృఢ సంకల్పంతో ఉన్న రెండెకరాల భూమిని సొంతంగా సాగు చేస్తూ అందరితో ఔరా అనిపించుకుంది. మగరాయునిలా అన్నీ తానై వ్యవసాయం చేస్తూ కూతురి పెళ్లి చేసింది. తాను వ్యవసాయం చూసుకుంటూ కుమారుడి గల్ఫ్ పంపించి అందరి మన్ననలు పొందుతోంది రాజమణి.

బీడీలు చుట్టి.. ప్రయోజకులను చేసి..



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): బీడీలు చుడుతూ కుమారులను ప్రయోజకులుగా చేశారు కల్యాణి గ్రామానికి చెందిన వీణాకుమారి. వీణాకుమారి భర్త లక్ష్మీనారాయణ 1997లో అనారోగ్యంతో మృతి చెందారు. భర్త మృతి చెందిన సమయంలో వీణాకుమారికి ముగ్గురు మగ పిల్లలు భాను ప్రకాశ్(6), రామకృష్ణ(4), హరికృష్ణ(2) ఉన్నారు. ఆ సమయంలో కుటుంబ భారం వీణాకుమారిపై పడింది. తనకు వచ్చిన వృత్తితో కుటుంబాన్ని పోషించారు. బీడీలు చుడుతూనే కుమారులను ప్రయోజకులుగా చేశారు. ప్రస్తుతం పెద్ద కుమారుడు భాను ప్రకాష్ ఎల్లారెడ్డి మండలంలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో జూనియర్ లైన్‌మెన్‌గా ప్రభుత్వ ఉద్యోగం చేస్తుండగా.. రెండో కుమారుడు రామకృష్ణ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని చేస్తున్నారు. మూడో కుమారుడు మొబైల్ దుకాణాన్ని నడుపుతూ వ్యాపారం చేస్తున్నారు. భర్త మృతి చెందినా ధైర్యంతో కుటుంబాన్ని పోషించి కుమారులను ప్రయోజకులుగా చేసి అందరికి ఆదర్శంగా నిలిచిన మహిళామూర్తి వీణాకుమారి.

కుట్టు శిక్షణతో నలుగురికి ఉపాధి

నిజాంసాగర్(జుక్కల్): పెళ్లి తర్వాత పూట గడవటమే కష్టమైన తరుణంలో కుటుంబ పోషణ భారాన్ని భుజాలపై వేసుకుని స్వయం ఉపాధిని ఎంచుకుని ముందుకు వెళ్తోంది సమదాన. ఎవరో వస్తారు.. ఏదో చేస్తారు అని ఎదురు చూడకుండా యూట్యూబ్‌లో వీడియోలు చూస్తూ టైలరింగ్ నేర్చుకున్నారు. వివరాలు.. మహమ్మద్ నగర్‌కు చెందిన సమదాన, రవి దంపతులది నిరుపేద కుటుంబం. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. రెక్కాడితే గాని పూట గడవని పరిస్థితి. భర్త రవి వ్యవసాయ కూలి. కుటుంబ పోషణ భారంగా మారిన తరుణంలో స్వయం ఉపాధి కోసం ఎన్నోమార్గాలను అన్వేషించింది. చివరికి చేతిలో ఉండే సెల్‌ఫోన్ ద్వారానే వీడియోలు చూస్తూ టైలరింగ్ నేర్చుకుంది. ఏడేళ్ల నుంచి ఇంట్లోనే టైలరింగ్ చేస్తూ నెలకు రూ.25 వేల వరకు సంపాదిస్తోంది. ఇప్పుడు సొంతంగా టైలరింగ్ దుకాణాన్ని ఏర్పాటు చేసుకొని యువతులకు కుట్టు శిక్షణ ఇస్తోంది. సొంతంగా దుకాణం ప్రారంభించడంతో వ్యాపారం లాభసాటిగా ముందుకు వెళ్తోంది. తను సంపాదించిన డబ్బులతో పిల్లలను చదివిస్తూ, కుటుంబాన్ని పోషిస్తూ ఆదర్శంగా నిలిచారు సమదాన.



ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

- ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

దోమకొండ: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల చదువుపై దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం గొట్టిముక్కుల గ్రామంలో అంబేడ్కర్ సంఘాన్ని ప్రారంభించారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని సంఘం ప్రతినిధులకు సూచించారు. బీజేపీ మండల అధ్యక్షుడు చింతల రాజేష్, నాయకులు యశ్‌పాల్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.



సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మమ్మల్ని విధుల్లో చేర్పించండి

కామారెడ్డి టౌన్: ఏడు నెలల క్రితం రెవెన్యూ శాఖ నుంచి తమను రిలీవ్ చేశారని, కామారెడ్డి మున్సిపల్‌లో జాయిన్ కావాలని కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వుల మేరకు విధుల్లో చేర్చుకోవాలని 25 మంది వీఆర్ఏలు గురువారం ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని వేడుకున్నారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశం అనంతరం ఎమ్మెల్యేను వారంతా కలిశారు. 7 నెలలుగా మున్సిపల్ కార్యాలయం ముందు పార్కులో రోజంతా కూర్చుని వెళ్తున్నామని, తమను జాయిన్ చేసుకోవడం లేదని వివరించారు. జీతాలు లేక కుటుంబ పోషణ భారంగా మారిదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కాళ్లపై పడి పలువురు వీఆర్ఏలు వేడుకున్నారు. కలెక్టర్‌తో మాట్లాడి న్యాయం చేస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.



ఎమ్మెల్యేకు విన్నవించుకుంటున్న వీఆర్ఏలు

త్రుటిలో తప్పిన ప్రమాదం



బీబీపేట: మండల కేంద్రంలోని పశువైద్యశాలలో గురువారం పైపెచ్చులూడి కిందపడ్డాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. గురువారం ఉదయం పశువైద్యాధికారి హేమశ్రీ ఎప్పటిలాగే విధులకు హాజరయ్యారు. ఆమె కార్యాలయంలో ఉన్నప్పుడు ఉన్నట్టుండి పైపెచ్చులూడి కిందపడ్డాయి. దీంతో వెంటనే ఆమె బయటకు రావడంతో ప్రమాదం తప్పింది. పశువైద్యశాలకు పక్కా భవనం లేకపోవడంతో శిథిలావస్థలో ఉన్న పాత జీపీలో పశువైద్యశాలను కొనసాగిస్తున్నారు. నూతన భవనం కోసం ఎన్నోసార్లు అటు అధికారులకు, ఇటు నాయకులకు విన్నవించినా చర్యలు తీసుకోలేదని హేమశ్రీ వాపోయారు. బయట కూర్చొని విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆమె తెలిపారు.

ఏకపక్షంగా ఎజెండా తయారు సరికాదు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్‌లో బీఆర్ఎస్ చైర్‌పర్సన్‌తో పాటు వారి కౌన్సిలర్లు ఏకపక్షంగా వారి వార్డులకే అనుకూలంగా ఎజెండాను తయారు చేస్తున్నారని కాంగ్రెస్ కౌన్సిలర్లు ఆరోపించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో వారు మాట్లాడారు. అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని గత సమావేశంలో ఎజెండా అంశాలను మార్చాలని తెలిపినా మళ్లీ పాత ఎజెండానే సమావేశంలో పొందుపర్చారని అన్నారు. కాంగ్రెస్ కౌన్సిలర్ల వార్డుల అభివృద్ధిపై పక్షపాతం చూపుతున్నారని ఆరోపించారు. వచ్చే సమావేశంలో కౌన్సిలర్ల అభిప్రాయాలతో ఎజెండాలను తయారు చేసి అన్ని వార్డుల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. తమ వినతి మేరకు ఎజెండా అంశాలపై ఇంజినీరింగ్ అధికారులతో విచారణకు ఆదేశించిన ఎమ్మెల్యే, కలెక్టర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియా, ఫ్లోర్ లీడర్ అన్వర్ హైమద్, కౌన్సిలర్ జ్ఞానేశ్వరి, శంకర్‌రావు, బూక్యా రాజు, రాజేశ్వర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు

అవిశ్వాసానికి రంగం సిద్ధం

- కాంగ్రెస్‌లో చేరిన ఐదుగురు బీఆర్ఎస్ డైరెక్టర్లు

బాన్సువాడ రూరల్: తెలంగాణలో అధికార మార్పిడితో బాన్సువాడలో రాజకీయాలు శరవేగంగా మారిపోతున్నాయి. తాజాగా గురువారం బుడిమి సొసైటీ ఐదుగురు డైరెక్టర్లు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిపోయారు. వారిని గాంధీభవన్‌లో బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు కాంగ్రెస్‌లోనికి ఆహ్వానించారు. 2020లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి పూర్తిస్థాయి మెజార్టీ ఉండటంతో చైర్మన్ స్థానానికి పిట్ల శ్రీధర్, గంగుల గంగారాం పోటీపడ్డారు. దీంతో చెరో రెండున్నర సంవత్సరాలు పదవి చేపట్టడానికి ఒప్పందం కుదిరి పిట్ల శ్రీధర్ పదవీకాలం పూర్తిచేశారు. ప్రస్తుతం గంగుల గంగారాం చైర్మన్‌గా కొనసాగుతుండగా అసెంబ్లీ ఎన్నికల అనంతరం పలువురు డైరెక్టర్లు పార్టీ మారారు. 13 మంది డైరెక్టర్లలో పుండరికం మృతితో 12 మంది డైరెక్టర్లకు గానూ ప్రస్తుతం కాంగ్రెస్ బలం 9కి చేరింది. దీంతో ఏక్షణమైనా అధిష్టానం సూచనతో చైర్మన్‌పై అవిశ్వాసానికి డీసీవోకు నోటీసు ఇవ్వడానికి డైరక్టర్లు సిద్ధమయ్యారు. అవిశ్వాసం నెగ్గితే ప్రస్తుతం వైస్‌చైర్మన్‌గా కొనసాగుతున్న మధుసూదన్‌రెడ్డి చైర్మన్ అయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

క్రైం కార్నర్

బాలిక ఆత్మహత్య కేసులో నిందితుడికి రిమాండ్

లింగంపేట(ఎల్లారెడ్డి): ప్రేమ పేరుతో మైనర్ బాలికను గర్భవతిని చేసి మోసం చేసిన కొడబోయిన అశోక్‌ను గురువారం జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను మోసం చేసి ఆమె ఆత్మహత్యకు కారణమైన అశోక్‌పై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

మరొకరిపై పోక్సో కేసు..?

కామారెడ్డి క్రైం: మైనర్ బాలికను లైంగికంగా వేధించిన కేసులో ఒకరిపై పట్టణ పోలీసులు గురువారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టణంలోని ఓ క్రీడా ప్రాంగణంలో పట్టణానికి చెందిన 12 ఏళ్ల బాలిక బ్యాడ్మింటన్ ప్రాక్టీస్‌కు వచ్చేది. అక్కడ కోచ్‌గా వ్యవహరిస్తున్న వ్యక్తి ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించగా కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిసింది. బాలిక మైనర్ కావడంతో పోలీసులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారు.

విద్యార్థినులను వేధించిన ఇద్దరికి..

భిక్కనూరు: పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన ఇద్దరిని అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ గురువారం తెలిపారు. ఈనెల 1న కంచర్ల గ్రామానికి చెందిన విద్యార్థినులు పెద్దమల్లారెడ్డి గ్రామంలోని పాఠశాలకు వెళ్తుండగా ముగ్గురు ఆకతాయిలు వేధించారు. ఈ విషయమై విద్యార్థినుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు విచారణ జరిపి తిరుపతి, బాలేష్‌లతో పాటు మరో మైనర్ బాలుడిని అరెస్టు చేసి న్యాయమూర్తి దీక్ష ఎదుట హాజరుపరచగా.. ఆమె తిరుపతి, బాలేష్‌లకు 14 రోజులు రిమాండు విధించారు. మరో నిందితుడు మైనర్ కావడంతో తల్లిదండ్రుల సొంత పూచీకత్తుపై ఇంటికి పంపించారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

భిక్కనూరు: బస్వాపూర్‌కు చెందిన ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ గురువారం తెలిపారు. పేకాట ఆడుతుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి రూ.8,240 నగదు స్వాధీనం చేసుకున్నారు.

కాలంచెల్లిన బిస్కెట్ల విక్రయం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేటలో గాంధీవిగ్రహం సమీపంలోని ఓ దుకాణంలో కాలంచెల్లిన బిస్కెట్‌లను విక్రయించిన ఘటన గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మోచె రవి అనే యువకుడు ఆ దుకాణంలో బిస్కెట్ ప్యాకెట్లను కొనుగోలు చేసి ఇంటికి తీసుకెళ్లాడు. ఇంట్లో పిల్లలతోపాటు రవి కూడా బిస్కెట్లను తిన్నాడు. బిస్కెట్లు తిన్న పిల్లలు వాంతులు చేసుకోవడంతో అనుమానం వచ్చి రవి బిస్కెట్ ప్యాకెట్‌పై ఉన్న తేదీని చూశాడు. గత నెల 12తో గడువు తీరిపోవడంతో దుకాణదారుడిని నిలదీశాడు. పొరపాటున కాలంచెల్లిన బిస్కెట్లు విక్రయించానని, మరోమారు ఇలా జరగకుండా చూసుకుంటానని దుకాణదారుడు చెప్పడంతో రవి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. సోషల్‌మీడియాలో ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు వైరలయ్యాయి.

మహిళ మృతదేహం లభ్యం

నిజాంసాగర్(జుక్కల్): పిట్లం మండలం నాగంపల్లి తండా వెళ్లే మార్గంలో చెట్ల పొదల్లో గురువారం సగం కాలిన మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మహిళ వయసు సుమారు 25 నుంచి 35 సంవత్సరాలు మధ్య ఉండవచ్చు. మహిళను 20 రోజుల కిందట హత్య చేసి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మహిళ బ్లూ కలర్ చీర, పింక్ కలర్ బ్లౌజ్, పసుపు, ఎరుపు రంగు గాజులు, కాళ్లకు పట్టీలు ధరించి ఉన్నట్లు బాన్సువాడ రూరల్ సీఐ సత్యనారాయణగౌడ్ తెలిపారు. మహిళకు సంబంధించిన సమాచారం తెలిస్తే బాన్సువాడ రూరల్ సీఐ సత్యనారాయణగౌడ్, పిట్లం ఎస్సై నీరేష్‌ను సంప్రదించాలని కోరారు. గద్దగుండు తండా–నాగంపల్లి వెళ్లే రోడ్డు మార్గం అటవీ ప్రాంతం కావడంతో ఎక్కడో చంపి ఇక్కడ కాల్చి వేసి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

కామారెడ్డి క్రైం: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి బావయ్య అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. తల్లిదండ్రులను కంటికి రెప్పలా కాపాడుకోవాలన్నారు. సమాజంలో ఎన్ని సమస్యలు ఎదురైనా ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. ఈ సంవత్సరం 'మహిళల పెట్టుబడి పురోగతిని వేగవంతం చేయండి' అనే సందేశంతో మహిళా దినోత్సవాన్ని జరుపుకొంటున్నామని తెలిపారు. ఉత్తమ సేవలందించిన ఉద్యోగినులను సన్మానించారు. జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి సింహారావు పాల్గొన్నారు.



మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న బావయ్య

ప్రణాళికాబద్ధంగా చదవాలి

బాన్సువాడ రూరల్: పదోతరగతి పరీక్షలు దగ్గర పడుతున్నాయని, విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికాబద్ధంగా చదవాలని బాన్సువాడ సీఐ కృష్ణ సూచించారు. గురువారం ఆయన బోర్లం జెడ్పీ హైస్కూల్‌లో ఏఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్సెస్సీ విద్యార్థులకు విజయస్ఫూర్తి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఇష్టపడి చదివితేనే మార్కులు వస్తాయన్నారు. విద్యార్థులు ప్రతి క్షణాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అయ్యాల సంతోష్, ప్రధానోపాధ్యాయులు సరఫ్. వెంకట రమణలతో కలిసి ఎస్సెస్సీ విద్యార్థులకు పరీక్షప్యాడ్, ఇతర పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు.

ప్రఖ్యాత మహిళల వేషధారణలో చిన్నారులు



మాచారెడ్డి: మహిళా దినోత్సవం సందర్భంగా అక్కాపూర్ పాఠశాల విద్యార్థినులు ప్రపంచ ప్రఖ్యాత మహిళల వేషధారణతో అలరించారు. ఎంపీటీసీ లత, మాజీ సర్పంచ్ మమత, ఎస్ఎంసీ వైస్ చైర్‌పర్సన్ నాగలక్ష్మి, టీచర్లు అనురాధ, సుజాత, నాగరాణిలను సన్మానించారు. ఎంఈవో ఎల్లయ్య, హెచ్‌ఎంలు వెంకటాచారి, మంజుశ్రీ ఉన్నారు.

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య

కామారెడ్డి క్రైం: జీవితంపై విరక్తి చెంది చెట్టుకు ఉరి వేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. వివరాలు... పట్టణంలోని హరిజనవాడకు చెందిన అన్నేపల్లి శేఖర్(36)కు ఏడేళ్ల క్రితం బాలలక్ష్మీతో వివాహం జరిగింది. వారికి కుమారుడు ఉన్నాడు. తరచుగా భార్యా భర్తల మధ్య గొడవలు జరుగుతుండటంతో బాలలక్ష్మి తన కుమారుడిని తీసుకుని తల్లి ఇంటి వెళ్లి అక్కడే ఉంటోంది. దీంతో మనస్తాపం చెందిన శేఖర్ కొద్ది రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తితో గురువారం నవాబ్ వెంచర్‌లో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

పొత్తుపై నేడు స్పష్టత!

- అమిత్ షా, నడ్డాలతో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్ష పార్టీల పొత్తుల వ్యవహారంలో శుక్రవారం స్పష్టత వచ్చే అవకాశం ఉంది. న్యూఢిల్లీలో గురువారం రాత్రి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాలతో అమిత్ షా నివాసంలో టీడీపీ, జనసేన అధ్యక్షులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. పొత్తులు, సీట్ల సర్దుబాటుపై వీరు చర్చించినట్లు సమాచారం. తమకు 8–10 లోక్‌సభ స్థానాలు, 15–20 అసెంబ్లీ స్థానాలు ఇస్తేనే పొత్తుకు ఓకే చెబుతామని బీజేపీ పెద్దలు కరాఖండిగా చెప్పారని తెలిసింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై శుక్రవారం ఒక స్పష్టత రానుండగా.. సీట్ల సర్దుబాటు విషయంలో బీజేపీ పెద్దలతో జరిగిన భేటీకి సంబంధించి ఏ క్షణానైనా ఒక అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. 2018లో ఎన్డీఏ నుంచి టీడీపీ బయటికి వెళ్లిపోయిన తర్వాత విశాఖపట్నం, రాజంపేట. రాజమండ్రి, హిందూపురం, తిరుపతి, అరకు, విజయవాడ వంటి లోక్‌సభ నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతంపై తాము ఏ విధంగా ప్రత్యేక దృష్టి సారించామన్న అంశాన్ని బీజేపీ పెద్దలు చర్చల సందర్భంగా తెరపైకి తెచ్చారు. అందువల్ల తామడిగిన లోక్‌సభ స్థానాలను ఎట్టి పరిస్థితుల్లోనూ కేటాయించాలని బీజేపీ అగ్రనేతలు చంద్రబాబు, పవన్‌లకు స్పష్టం చేశారని తెలిసింది.

‘చేయూత’ పండుగ

- మహిళా దినోత్సవ వేళ అక్కచెల్లెమ్మలకు సాయాన్ని అందించడం ఎంతో సంతోషాన్నిస్తోంది: అనకాపల్లి సభలో ఏపీ సీఎం జగన్
- వైఎస్సార్ చేయూతతో 2,698,931 మంది లబ్ధిదారులకు రూ.5,060.49 కోట్లు సాయం
- 14 రోజుల పాటు పండుగ వాతావరణంలో ‘చేయూత’ కార్యక్రమాలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: అక్కచెల్లెమ్మల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా మనందరి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, మహిళా దినోత్సవం ముందు రోజు ‘వైఎస్సార్ చేయూత’ ద్వారా ఆర్థిక సాయం అందించడం ఎంతో సంతోషం కలిగిస్తోందని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. మహిళా సాధికారత పట్ల ఇంత చిత్తశుద్ధి చూపిన ప్రభుత్వం దేశ చరిత్రలోనే మరొకటి లేదన్నారు. 45 – 60 ఏళ్ల వయసున్న మహిళలకు నాలుగో విడత ఆర్థిక సాయం అందించే వైఎస్సార్ చేయూత కార్యక్రమాన్ని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన అనకాపల్లి జిల్లాలోనే నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ ఆర్థిక సాయంతో ఎదిగిన మహిళలంతా తమ విజయగాథలను వివరిస్తూ రానున్న 14 రోజుల పాటు సచివాలయాలవారీగా కార్యక్రమాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు – దత్తపుత్రుడు గతంలో మేనిఫెస్టోలో అక్కాచెల్లెమ్మలకు ఇచ్చిన ఏ వాగ్దానాన్నీ అమలు చేయలేదని మండిపడ్డారు. వారి పేరు చెబితే ఎనిమిది రకాల మోసాలు, దగా గుర్తురాగా మన ప్రభుత్వం పేరు చెబితే సంక్షేమం గుర్తుకొస్తుందన్నారు. చంద్రబాబును చూస్తే విశ్వసనీయతలేమి గుర్తుకొస్తుందని, దత్తపుత్రుడి పేరు చెబితే వివాహ వ్యవస్థకే కళంకం తెచ్చేలా కార్లను మార్చినట్లు భార్యలను మార్చే వ్యవహారం గుర్తుకొస్తుందని విమర్శించారు. వారిని నమ్మితే కాటేసే పామును నమ్మినట్టేనని, తినేసే పులిని ఇంటికి తెచ్చుకోవడమేనని హెచ్చరించారు. ప్రతి ఇంటికీ మేలు చేసిన మీ బిడ్డకు మీరే స్టార్ క్యాంపైనర్లుగా నిలిచి మంచి చేసిన ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్ చేయూత నాలుగో విడత కింద రాష్ట్రవ్యాప్తంగా 26,98,931 మంది అక్కచెల్లెమ్మలకు రూ.5,060.49 కోట్ల ఆర్థిక సాయాన్ని అందించే కార్యక్రమాన్ని గురువారం అనకాపల్లి జిల్లా కశింకోట మండలం పిసినికాడలో సీఎం జగన్ ప్రారంభించారు.



అనకాపల్లి సభలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

4 రోజుల్లో 850 ఎకరాలా!

▶ మొదటి పేజీ తరువాయి

ఐఎంజీ భారత్‌తో ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. క్రీడల్లో రాష్ట్ర యువతను చాంపియన్లుగా తీర్చిదిద్దడం కోసం అంటూ ఈ ఎంవోయూ చేసుకుంది. ఇందులో భాగంగా స్పోర్ట్స్ అకాడమీలను నిర్మించడం, అభివృద్ధి చేయడం, నిర్వహించడం కోసం అంటూ రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలి సర్వే నంబర్ 25లో 400 ఎకరాలు ఇచ్చేందుకు అంగీకరించింది. అలాగే రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండలం మామిడిపల్లి సర్వే నంబర్ 99/1లోని మరో 450 ఎకరాలు అప్పగించేందుకు కూడా ఒప్పందం చేసుకుంది. అంతేకాకుండా ఐఎంజీ భారత్ అంతర్జాతీయ స్థాయిలో ప్రధాన కార్యాలయాన్ని నిర్మించుకునేందుకు బంజారాహిల్స్ నుంచి మాదాపూర్ వెళ్లే మార్గంలో ఎకరం నుంచి 5 ఎకరాలు కూడా ఇస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు 2004, ఫిబ్రవరిలో గచ్చిబౌలిలో ఎంతో విలువైన 400 ఎకరాలను స్వల్ప మొత్తానికి అంటే కేవలం రూ.2 కోట్లకే ఐఎంజీ భారత్‌కు అప్పగించింది (సేల్ డీడ్ చేసింది). అయితే 2006లో ప్రభుత్వ ఆస్తులను కాపాడే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తెచ్చింది. 2007లో దీన్ని చట్టబద్ధం చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆస్తి (పరిరక్షణ, రక్షణ, పునఃప్రారంభం) చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్ట ప్రకారం ఐఎంజీ భారత్‌తో అంతకుముందు ప్రభుత్వం చేసుకున్న ఎంఓయూ, ఆ మేరకు సేల్‌డీడ్ కూడా రద్దయ్యాయి. ఈ క్రమంలో 2007 చట్టంలోని సెక్షన్ 2 ప్రకారం సంబంధిత లావాదేవీలు రద్దు చేయడమే కాకుండా ఐఎంజీ చెల్లించిన మొత్తాన్ని ఏడాదికి 12 శాతం వడ్డీతో తిరిగి ఇచ్చేయడానికి ప్రభుత్వం ముందుకొచ్చింది. అయితే ప్రభుత్వ చట్టాన్ని సవాల్ చేస్తూ ఐఎంజీ భారత్ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

పూర్తి కేబినెట్ ఆమోదం లేదు: ఏజీ

‘పూర్తి కేబినెట్ ఆమోదం లేకుండా నాటి ప్రభుత్వం ఎంఓయూపై సంతకాలు చేసింది. ఆ సమయంలో భూమి విలువ ఎకరం రూ.13 లక్షలు ఉండగా, పిటిషనర్‌కు రూ.50 వేల స్వల్ప మొత్తానికే సరైన ఎలాంటి కారణం లేకుండా విక్రయించారు. ఐఎంజీ భారత్‌కు అమెరికన్ కంపెనీ అయిన ఐఎంజీతో ఎలాంటి సంబంధం లేదు. కానీ దానికి అనుబంధ సంస్థ అంటూ మోసగించారు. అందుకే తదుపరి ప్రభుత్వం ఎంవోయూను రద్దు చేసింది. పరిహారం ఇవ్వాలని కూడా నిర్ణయించింది. 2007లో ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం ఒక్క ఐఎంజీ కోసమే కాదు. ఇది ఇతర భూ లావాదేవీలకు కూడా వర్తిస్తుంది. ఇలా చట్టం తీసుకొచ్చే అధికారం రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్ ప్రకారం శాసనసభకు ఉంది. రాష్ట్రపతి ఆమోదం పొందిన తర్వాత 2007లో చేసిన చట్టం అమల్లోకి వచ్చింది..’ అంటూ అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. కాగా పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది వేదుల వెంకటరమణ..‘ఒక ఐఎంజీ భారత్ కోసమే చట్టాన్ని తేవడం సమర్థనీయం కాదు. ఎంవోయూ ను రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి లేదు..’ అంటూ వాదించారు.

ఎలాంటి విచారణ చేయకుండానే ఆమోదం: ధర్మాసనం

‘2003 ఆగస్టు 5న ఐఎంజీ భారత్ ఏర్పాటైన తర్వాతి రోజే, ఎలాంటి విచారణ చేసుకోకుండానే 6న నాటి యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం, కల్చరల్ డిపార్ట్‌మెంట్ కంపెనీకి ఆమోదం తెలుపుతూ సర్క్యులర్ జారీ చేసింది. అదే రోజు నలుగురు మంత్రులతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దీనికి ఆగమేఘాలపై గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఆ తర్వాత 9వ తేదీన ఎంవోయూ కుదుర్చుకున్నారు. స్పోర్ట్స్ అకాడమీ, స్టేడియాల నిర్వహణకయ్యే ఖర్చు ఏడాదికి రూ.2.5 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ అయితే ఆ మొత్తాన్ని కూడా ప్రభుత్వమే భరిస్తుందని ఒప్పందంలో పేర్కొన్నారు. తొలి మూ డేళ్లపాటు విద్యుత్, నీటి, సీవేజ్, డ్రైనేజీ బిల్లులనూ 100 శాతం తిరిగి చెల్లిస్తామని చెప్పారు. ఆ తర్వాత క్రమంగా దీన్ని తగ్గిస్తామని తెలిపారు. ముఖ్యంగా పిటిషనర్‌కు అంతర్జాతీయ క్రీడా సంస్థ (ఐఎంజీ, అమెరికా)తో సంబంధం గానీ, గతంలో క్రీడా రంగంలో అనుభవం గానీ లేవు. ఉన్నట్లుగా పిటిషనర్ ఐఎంజీ ఎలాంటి పత్రాలను ప్రభుత్వానికి సమర్పించలేదు.

ప్రభుత్వం రద్దయ్యాక 400 ఎకరాలకు సేల్‌డీడ్!

2003, నవంబర్ 14నే చంద్రబాబు ప్రభుత్వం రద్దయ్యింది. తర్వాత ఆపద్ధర్మ ప్రభుత్వంగా మాత్రమే కొనసాగింది. ఈ ఆపద్ధర్మ ప్రభుత్వ హయాంలోనే 400 ఎకరాలను నామమాత్రపు ధరకు ఐఎంజీ భారత్‌కు అప్పగిస్తూ సేల్‌డీడ్ చేసింది. అయితే 2007లో భూములపై రాష్ట్ర శాసనసభకు ఉన్న అధికారాలతోనే ప్రభుత్వం చట్టాన్ని రూపొందించింది. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో సరైన కారణాలు ఉన్నప్పుడు రాజ్యాంగం ప్రభుత్వానికి ఈ అధికారం కల్పించింది. జాగ్రత్తగా గమనిస్తే.. కంపెనీ ఏర్పాటైన కేవలం 4 రోజుల్లోనే వేల కోట్ల విలువచేసే వందల ఎకరాల భూములు అప్పగించారు. మరే ఇతర కంపెనీకి రాష్ట్రంలో అంత స్వల్ప సమయంలో ఇలా భూములు ధారాదత్తం చేయలేదు. పిటిషనర్‌కు పరిహారం కోరే హక్కు ఉంది. అయితే 2007లో తీసుకొచ్చిన చట్టాన్ని తన ఒక్క కంపెనీ కోసమే అంటూ సవాల్ చేయలేరు.

ప్రజా ఆస్తుల పరిరక్షణకే వైఎస్ సర్కార్ చట్టం..

రాజ్యాంగంలోని ఆర్టికల్ 14ను ప్రభుత్వం ఉల్లంఘించిందన్న వాదన కూడా సరికాదు. ప్రజల ఆస్తులను కాపాడటం కోసమే 2007లో వైఎస్ సర్కార్ చట్టం తీసుకొచ్చింది. అది ఎవరి వ్యక్తిగత అవసరాల కోసం కాదన్న విషయం గ్రహించాలి. కంపెనీ ఏర్పాటు చేసిన నాలుగు రోజుల్లో వేల కోట్ల భూములు గతంలో మరే ఇతర కంపెనీకి ప్రభుత్వం కేటాయించినట్లుగా ఐఎంజీ నిరూపించలేకపోయింది. అలాగే ప్రభుత్వం చేసిన చట్టం చెల్లుబాటును అడ్డుకునేందుకు ఇందులో ఎలాంటి ఉల్లంఘనలు కూడా జరగలేదు. సేల్ డీడ్‌ను రద్దు చేయకూడదనే వాదన ఆమోదానికి అర్హమైనది కాదు. ఎంఓయూనే రద్దయినప్పుడు సేల్‌డీడ్ అమల్లో ఉండటం సాధ్యం కాదు..’ అంటూ ధర్మాసనం తన తీర్పులో వ్యాఖ్యానించింది.

సీబీఐ విచారణకు లేఖ రాశామన్నారుగా..

‘ఐఎంజీ భారత్‌కు భూముల అప్పగింతపై సీబీఐ విచారణ కోరుతూ గతంలో లేఖ రాశాం అన్నారు.. ఎంత వరకు వచ్చింది? మీరు విచారణ కోరతారా? లేక మమ్మల్నే సీబీఐకి అప్పగిస్తూ ఆదేశాలు ఇవ్వమంటారా?’ అని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. తదుపరి విచారణలోగా ఏదో ఒకటి చెప్పాలని ఆదేశిస్తూ, విచారణను వారం పాటు వాయిదా వేసింది. ఐఎంజీ భారత్‌కు భూముల కేటాయింపు, ఎంవోయూ, సేల్ డీడ్.. ఇలా అన్ని అంశాలపై కేంద్ర దర్యాప్తు బృందం (సీబీఐ)తో విచారణ జరిపించాలని కోరుతూ టి.శ్రీరంగారావుతో పాటు మరొకరు 2012లో హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ ఒప్పందం వెనుక పెద్ద ఎత్తున ప్రజాధనం దుర్వినియోగం చేసే ప్రయత్నం జరిగిందని, దీని వెనుక ఉన్న కుట్రదారులెవరో తేల్చాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ పిటిషన్లను గురువారం మరోసారి సీజే ధర్మాసనం విచారించింది. సీబీఐకి అప్పగించే విషయంలో ప్రభుత్వం తాత్సారం చేస్తోందని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది గంద్ర మోహన్‌రావు ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దీనిపై ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ అభిప్రాయం ధర్మాసనం కోరింది. ఆయన తమకు కొంత సమయం కావాలనడాన్ని, ప్రభుత్వాన్ని సంప్రదించిన తర్వాత తెలియజేస్తాననడాన్ని తప్పుబట్టింది. ఇంకా ఎంతకాలం ఆగాలని, వారంలోగా ఏదో ఒకటి తేల్చిచెప్పాలని ఆదేశిస్తూ విచారణ వాయిదా వేసింది. కాగా గతంలో ఇదే పిల్‌పై విచారణ సందర్భంగా ప్రభుత్వం కోరితే దర్యాప్తు చేయడానికి సిద్ధంగా ఉన్నామని న్యాయస్థానానికి సీబీఐ తెలియజేయడం గమనార్హం.

10 మందితో కాంగ్రెస్ తొలి జాబితా!

- ఢిల్లీలో సమావేశమైన పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ
- సర్వేలు, సమీకరణాలు పరిగణనలోకి తీసుకుని అభ్యర్థుల ఎంపిక

సాక్షి, న్యూఢిల్లీ:వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికపై తొలి విడత కసరత్తును ఏఐసీసీ అగ్ర నాయకత్వం పూర్తి చేసింది. తెలంగాణలోని సుమారు పది స్థానాలకు అభ్యర్థులను ఫైనల్ చేసింది. ప్రాంతీయ, కుల సమీకరణలు, రాజకీయ నేపథ్యం, సర్వేల్లో విజయావకాశాల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసింది. అభ్యర్థుల ప్రకటన ఏక్షణమైనా వెలువడవచ్చని ఏఐసీసీ వర్గాలు తెలిపాయి. పెద్దపల్లిలో గడ్డం వంశీ, మహబూబ్‌నగర్‌లో వంశీచంద్‌రెడ్డి, నిజామాబాద్‌లో టి.జీవన్‌రెడ్డి, మహబూబాబాద్‌లో బలరాంనాయక్, చేవెళ్లలో సునీత మహేందర్‌రెడ్డి, నల్లగొండలో రఘువీర్‌రెడ్డి, కరీంనగర్‌లో ప్రవీణ్‌రెడ్డిల పోటీకి ఎవరి నుంచి ఎలాంటి అభ్యంతరాలు లేక పోవడంతో వారి అభ్యర్థిత్వాలకు సీఈసీ ఆమోదం తెలిపినట్లు తెలిసింది. జహీరాబాద్ స్థానానికి సురేశ్ షెట్కార్, ఉజ్వల్‌రెడ్డిల పేర్లను పరిశీలించినట్లు సమాచారం.

కేంద్ర ఎన్నికల కమిటీ భేటీ

లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికపై చర్చించేందుకు గురువారం సాయంత్రం కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ ఏఐసీసీ కార్యాలయంలో భేటీ అయ్యింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీతో పాటు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, అంబికా సోని, తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఈసీ సభ్యుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి పరిశీలనలోకి వచ్చిన అభ్యర్థుల వివరాలు, స్క్రూటినీ అనంతరం మిగిలిన అభ్యర్థుల వివరాలను సీఈసీ ముందుంచారు. రెండున్నర గంటల పాటు జరిగిన భేటీలో సునీల్ కనుగోలు సహా ఏఐసీసీ స్థాయిలో చేసిన సర్వేల నివేదికలు ముందుపెట్టుకొని నియోజకవర్గాల వారీగా అభ్యర్థుల జాబితాను పరిశీలించారు. మొదటగా సింగిల్ పేర్లతో కూడిన స్థానాలను కమిటీ పరిశీలించింది. మొత్తంగా 8–10 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసినట్లు తెలిసింది. ఈ మేరకు జాబితాను ఏ క్షణమైనా విడుదల చేసే అవకాశం ఉందని అంటున్నారు.

మరిన్ని స్థానాలపై చర్చ

మిగతా స్థానాలపై కూడా చర్చించినా, మరోమారు సమావేశమై సర్వేల ఆధారంగా అభ్యర్థులను ఫైనల్ చేద్దామనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. సికింద్రాబాద్‌లో ఇటీవలే పార్టీలో చేరిన బొంతు రామ్మోహన్ దంపతులు, నాగర్‌కర్నూల్‌లో మల్లురవి, సంపత్ కుమార్, వరంగల్‌లో దారా సాంబయ్య సహా మరో పేరు, మల్కాజిగిరిలో చంద్రశేఖర్‌రెడ్డితో పాటు మరో ఇద్దరు, మెదక్‌లో మైనంపల్లి హన్మంతరావు, నీలం మధు, ఆదిలాబాద్‌లో ఆదివాసీలైన ఇద్దరి పేర్లపై చర్చ జరిగినట్లు తెలిసింది. ఆయా స్థానాలపై వచ్చే వారంలో తుది నిర్ణయం చేసే అవకాశాలున్నాయని అంటున్నారు.

ఇక్కడి నుంచి రాహుల్ పోటీ లేనట్టే!

తెలంగాణలోని ఏదో ఒక నియోజకవర్గం నుంచి పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీని పోటీకి దింపాలన్న రాష్ట్ర నేతల వినతిని ఏఐసీసీ తిరస్కరించినట్లు తెలిసింది.

అన్నింటా ఆమె..

అవనిలో సగమైన అతివలు కుటుంబ బాధ్యతల్లోనూ పాలు పంచుకుంటున్నారు. పురుషులతో సమానంగా కుటుంబ భారాన్ని మోస్తున్నారు. ఉపాధి అవకాశాల్లో మేము సైతం అంటూ వివిధ పనుల్లో, వ్యాపారాల్లో కొనసాగుతున్నారు. అవకాశాలను అందిపుచ్చుకుంటూ అన్ని రంగాల్లో రాణిస్తున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్













రేపటికి ముందడుగు

ఆంగ్లం నేర్పిస్తూ ఆదర్శంగా..

- మహిళలకు శిక్షణనిచ్చి..
- ఉపాధి కల్పించేలా చొరవ చూపుతున్న జ్యోతి

నిజామాబాద్‌నాగారం: మహిళా సాధికారతను మాటల్లో కాకుండా చేతల్లో చేసి చూపిస్తున్నారు లెట్స్ టాక్ ఇన్‌స్టిట్యూట్ యజమాని బి జ్యోతి. ఉన్నత చదువులు చదివి వంటింటికే పరిమితమైన ఎంతో మంది మహిళలకు ఇంగ్లిష్ భాష నేర్పించి ప్రయివేటు, కార్పొరేట్ కంపెనీల్లో ఉపాధి లభించేలా చేశారు. తెలుగు మాధ్యమంలో చదివి ఇంగ్లిష్ ఉచ్చరించేందుకు భయపడే ఎంతో మంది మహిళామణులను ఆంగ్ల వేదికల్లో అనర్గళంగా మాట్లాడేలా తీర్చిదిద్దారు. ఇప్పటికే నిజామాబాద్‌తో పాటు కామారెడ్డి, నిర్మల్, బాన్సువాడ, మహారాష్ట్ర నుంచి నాందేడ్, ధర్మాబాద్‌కు చెందిన పట్టణాల్లోని ఎంతోమందికి ఇంగ్లిష్ భాష నేర్పించారు. నగరంలోని శివాజీనగర్‌లో ఉన్న సంస్థ కార్యాలయంలో ఇంటర్, డిగ్రీ, పీజీ చదివి ఇంగ్లిష్ రాక వెనుకబడుతున్న నిరుద్యోగులకు శిక్షణ అందజేస్తున్నారు. అనతికాలంలోనే ఎంతోమంది మహిళల ఆదరణ చూరగొని ఇటీవల హమాల్‌వాడీలో రెండో బ్రాంచ్ ఏర్పాటు చేశారు.



మహిళలకు ఇంగ్లిష్ నేర్పిస్తున్న జ్యోతి

ప్రోత్సహిస్తే ఏదైనా సాధ్యం

మహిళలు స్వశక్తిమంతులు. వారికి కొంత తోడ్పాటునందిస్తే అన్ని రంగాల్లో రాణించగలరు. ఉన్నత చదువులు చదవి ఇంగ్లిష్ రాక చాలా మంది ఇంటికి పరిమితమవుతున్నారు. ఇలాంటి వారికోసం ఏదైనా చేయాలని నిజామాబాద్ నగరంలో 2018లో లెట్స్ టాక్ పేరిట ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేశాం. ఈ ఆరేండ్ల కాలంలో వందలాది మందికి శిక్షణ ఇచ్చాం. చాలా మంది విదేశాలకు కూడా వెళ్లారు. మహిళలు స్వశక్తిగా ఎదగడంతో పాటు ఇంటికి ఆర్థికసాయం అందజేయడం సంతోషం కలిగిస్తోంది.

– బి జ్యోతి

చదువుకున్న చోటే అధ్యాపకురాలిగా..

- అసిస్టెంట్ ప్రొఫెసర్ శాంతాబాయి

తెయూ(డిచ్‌పల్లి): తాను పీజీ చదివిన యూనివర్సిటీలోనే అకడమిక్ కన్సల్టెంట్‌గా చేరి, అనంతరం ఏడాదిలో అదే యూనివర్సిటీలో రెగ్యులర్ అధ్యాపకురాలిగా ఉద్యోగం సాధించిన అసిస్టెంట్ ప్రొఫెసర్ పి శాంతాబాయి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా శాంతాబాయి సక్సెస్ స్టోరీ.. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం నేరల్ తండాకు చెందిన పాల్తియా దశరథ్, లక్ష్మీబాయి దంపతుల కూతురు శాంతాబాయి 2006లో తెలంగాణ యూనివర్సిటీ ఏర్పాటు కాగానే తొలి బ్యాచ్‌లో మాస్ కమ్యూనికేషన్ విద్యార్థిగా పీజీలో చేరారు. పీజీ పూర్తి కాగానే అదే యూనివర్సిటీలో అకడమిక్ కన్సల్టెంట్‌గా చేరారు. 2009 వరకు అకడమిక్ కన్సల్టెంట్‌గా పని చేసిన ఆమె రెగ్యులర్ పోస్టుల కోసం నోటిఫికేషన్ రాగానే దరఖాస్తు చేసుకున్నారు. 2009లో మాస్ కమ్యూనికేషన్‌లో రెగ్యులర్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియామకమయ్యారు. చదువుకున్న యూనివర్సిటీలోనే అధ్యాపకురాలిగా ఉద్యోగం సాధించి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. అధ్యాపకురాలిగా పని చేస్తూనే తెయూలోనే పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ అందుకున్నారు. ప్రస్తుతం పరీక్షల విభాగంలో అడిషనల్ కంట్రోలర్ (యూజీ, కాన్ఫిడెన్షియల్) గా పని చేస్తున్నారు.



అసిస్టెంట్ ప్రొఫెసర్ శాంతాబాయి

అమ్మ స్ఫూర్తితో..

శాంతాబాయి డిగ్రీ చదువుతున్న సమయంలో తండ్రి దశరథ్ చనిపోయారు. తల్లి లక్ష్మీబాయి తాను చదువుకోకపోయినా కూతురును టీచర్‌గా చూడాలని బలంగా కోరుకునేది. భర్త చనిపోయినా అధైర్యపడకుండా తన పిల్లలు ముగ్గురిని ఉన్నత చదువులు చదివించారు. అమ్మను స్ఫూర్తిగా తీసుకుని శాంతాబాయి చదువుపై శ్రద్ధ చూపుతూ చివరకు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎంపికై ఆమె కోరికను నెరవేర్చారు.

భర్త ప్రోత్సాహంతో..

మా అమ్మ లక్ష్మీబాయి నాకు రోల్ మోడల్. మా అమ్మ చదువుతోనే సమాజంలో విలువ ఉంటుందని చెప్పేది. నన్ను టీచర్‌గా చూడాలనుకునేది. మా నాన్న చనిపోయినా మొక్కవోని ధైర్యంతో నన్ను, ఇద్దరు తమ్ముళ్లను ప్రోత్సహిస్తూ ఉన్నత చదువులు చెప్పించింది. యూనివర్సిటీలో నా గురువు ప్రొఫెసర్ శివశంకర్ సహకారంతో అధ్యాపకురాలిగా ఉద్యోగం సాధించి అమ్మ కల నెరవేర్చాను. భర్త దేవీసింగ్, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో పీహెచ్‌డీ పూర్తి చేయగలిగాను. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా బోధన చేస్తున్నా.

– శాంతాబాయి, అసిస్టెంట్ ప్రొఫెసర్

స్త్రీలను ప్రతి ఒక్కరు గౌరవించాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి ఎస్ఎన్ శ్రీదేవి

కామారెడ్డి క్రైం: స్త్రీలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని జిల్లా జడ్జి ఎస్ఎన్ శ్రీదేవి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కామారెడ్డి కోర్టు నుంచి నిజాంసాగర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. నిజాంసాగర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా జడ్జి మాట్లాడుతూ మహిళలకు అవకాశాలు కల్పిస్తే అంతరిక్షానికైనా వెళ్లగలరన్నారు. వారిని ప్రోత్సహించాలని సూచించారు. క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన మహిళా క్రీడాకారులను సన్మానించారు. సీనియర్ సివిల్ జడ్జి నాగరాణి, ఎస్పీ సింధు శర్మ, కలెక్టర్ సతీమణి శ్రద్ధ మహాజన్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, ట్రెయినీ ఐపీఎస్ కాజల్ సింగ్, డీఎఫ్‌వో నిఖిత, డీపీవో భాగ్యలక్ష్మి, ఎస్సీ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ బావయ్య తదితరులు పాల్గొన్నారు.

‘గృహజ్యోతి’ కోసం క్యూ

రామారెడ్డి: గృహజ్యోతి పథకంలో లబ్ధి చేకూరని వారు మండల పరిషత్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం ఇటీవలే గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే చాలా కుటుంబాలు 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించినా కరెంటు బిల్లు వచ్చింది. దీంతో వారంతా మండల పరిషత్ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాలలో సంప్రదించి వివరాలు నమోదు చేయించుకుంటున్నారు.



మా ఇంటి మహాలక్ష్మి



నిజామాబాద్ సిటీ: మగపిల్లాడితో ఆ కుటుంబ వారసత్వం పెరుగుతుందే తప్పా మిగతా అన్ని విషయాల్లో ఆడపిల్ల సమానమేనని అంటున్నారు బస్వాగార్డెన్ ప్రాంతానికి చెందిన హరీశ్ రెడ్డి రమ్య దంపతులు. మాకు మొదటి కాన్పుగా కుమార్తె పుట్టడంతో చాలా సంతోషించామని, మా ఇంట మహాలక్ష్మి పుట్టిందని ఎంతో మురిసిపోయి ఇక రెండో సంతానం వద్దనుకొన్నట్లు వారు పేర్కొన్నారు. పాప శ్రీతరెడ్డి పదో తరగతి వరకు ఇక్కడే చదివి బీటెక్ హైదరాబాద్‌లో చదువుతోంది. అప్పుడు తాము ఒంటరి వారిమై పోయామా అని బాధ కలిగింది. పాపను విడిచిపెట్టి ఏనాడూ ఉండలేదు. శ్రీత కోసం ఎంత కష్టమైనా పడతాం. ఎంఎస్ చదివేందుకు విదేశాలకు వెళ్తానంటోంది. కానీ, ఉద్యోగం మాత్రం తమతో ఉంటూ ఇండియాలోనే చేస్తానంటోంది మా పాప. ఇలా ఆడపిల్ల పుట్టిందని సంతోషించి అపురూపంగా చూసుకుంటున్న హరీశ్‌రెడ్డి దంపతులు ఎంతో మందికి ఆదర్శం.

స్వయంకృషితో ఎదిగి..

డొంకేశ్వర్: మండల కేంద్రానికి చెందిన కందనూరి జ్యోత్స్నది మధ్య తరగతి కుటుంబం. చామంతి మహిళా సంఘంలో సభ్యురాలిగా ఉండడంతో బ్యాంకు లింకేజీ రుణం తీసుకుంది. ఆ డబ్బులతో పదేళ్ల క్రితం తన ఇంటి వద్ద చిన్న బట్టల దుకాణం పెట్టుకుంది. దుస్తులు విక్రయించగా వచ్చిన లాభాలతో పాటు మళ్లీ రుణాలు పొందుతూ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుంటూ వస్తున్నారు. రూ.1లక్షతో మొదలై ప్రస్తుతం రూ.10లక్షల వ్యాపారానికి చేరారు. మండల ప్రజలకు, మహిళలకు అవసరమయ్యే అన్ని రకాల వస్త్రాలను హైదరాబాద్ నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. వ్యాపారంలో వచ్చిన డబ్బులను రొటేషన్ చేయడంతో పాటు పిల్లలపై చదువు, కుటుంబ పోషణకు ఉపయోగిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. స్వయం కృషితో వ్యాపారం చేస్తూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న జ్యోత్స్నను పలువురు అభినందిస్తున్నారు. భార్య వ్యాపారానికి భర్త రామాగౌడ్ సైతం తనవంతు సహకారం అందిస్తూ ప్రోత్సహిస్తున్నాడు.

